క్లుప్తంగా

బుద్ధ జయంతి వేడుకలు



బుద్ధుని విగ్రహం వద్ద వందనం సమర్పిస్తున్న చిన్నారులు

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామంలో గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలను సామాజిక కార్యకర్త అప్పారావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గౌతమ బుద్ధుడి విగ్రహానికి చిన్నారులతో కలిసి పూల మాలలు వేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజ్ఞానం తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించి, శాంతి మార్గాన్ని సూచించిన బుద్ధుడి బోధనలు ఆచరణీయమని చెప్పారు.అనంతరం పిల్లలకు పండ్లు, స్వీట్లు పంచారు.

జామికి జూనియర్ కళాశాల మంజూరు



మాట్లాడుతున్న ఎంఈఓ గంగరాజు, హెచ్ఎం రెహమాన్

జామి: మండల వాసులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మండల కేంద్రానికి మంజూరైందని ఎంఈఓ గంగరాజు, జామి ఉన్నత పాఠశాల హెచ్ఎం అబ్దుల్ రెహమాన్ తెలిపారు. జామి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ జామి హైస్కూల్‌లోనే ప్రత్యేకంగా జూనియర్ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. మండలంలోని విద్యావేత్తలు,విశ్రాంత ఉద్యోగులు కృషి ఫలించందని అన్నారు. కళాశాలలో ఈ ఏడాది ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్‌లు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను చేర్పించి కళాశాల అభ్యున్నతికి అంతా సహకరించాలని కోరారు.

కెమికల్ ట్యాంకర్ బోల్తా



బోల్తాపడిన ట్యాంకర్

బొండపల్లి: స్థానిక జాతీయ రహదారిపై గురువారం కెమికల్ (పొడి)లోడుతో వెళ్తున్న ఓ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. విజయనగరం నుంచి రాయగడ వైపు ఈ ట్యాంకర్ వెళుతోంది. డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో డ్రైవర్‌కు కానీ పక్కనే వెళుతున్న వాహనచోదకులకు కానీ ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ర్యాలీలు,ఊరేగింపులు నిషేధం



మాట్లాడుతున్న సీఐ ప్రభాకరరావు

గజపతినగరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ నెల 4వ తేదీన వెలువడతాయని, గెలుపు సంబరాల్లో భాగంగా ఆరోజున ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదని స్థానిక సీఐ ఎస్.వి.ప్రభాకరరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గజపతినగరం సర్కిల్ పరిధిలో ఉన్న అయిదు మండలాల్లో ఏ గ్రామంలో కూడా సంబరాలు చేయడం, బాణా సంచా కాల్చడం వంటివి చేయరాదని అన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభినందనలు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక విద్యనభ్యసించి 2024 సంవత్సరంలో ఉద్యోగం సాధించిన 134 మంది విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, తదితరులు గురువారం అభినందించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అభినందన సభలో ఇండస్ట్రీస్ ప్రమోటింగ్ అధికారి బి.కళింగవర్ధన మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యతో త్వరితగతిన ఉద్యోగాలు సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి పుష్పయాగం

విజయనగరం టౌన్: తోటపాలెంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి గురువారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. స్వామివారి 44వ బ్రహ్మోత్సవ తిరుకల్యాణ, అష్టోత్తర శత కలశ స్నపన మహకలశాభిషేక మహోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం రంగాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించిన పలువురికి ఆలయ కమిటీ అధ్యక్షుడు సూర్యభగవాన్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఫారం పాండ్ పనులకు అధిక ప్రాధాన్యం

- ఉపాధి హామీ పథకం ఈజీఎస్ జేసీ శివప్రసాద్



దత్తిరాజేరు: పెదమానాపురంలో ఉపాధి పనుల వద్ద వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీఓ వెంకటఅప్పలనాయుడు



జామి: భీమసింగిలో పారం పాండ్‌లను పరిశీలించి, అధికారులు వేతనదారులతో మాట్లాడుతున్న ఈజీఎస్ జేసీ శివప్రసాద్

జామి: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో ఫారం పాండ్‌లు, ట్రెంచ్ కంటింగ్ పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధి హామీ పథకం ఈజీఎస్(ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీం) జాయింట్ కమిషనర్ శివప్రసాద్ అధికారులకు సూచించారు.మండలంలోని భీమసింగి గ్రామంలో ఉపాధి హామీ పను లను క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. మామిడితోటల చుట్టూ చేపట్టిన ట్రెంచ్ కంటింగ్, తోటల వద్ద ఫారం పాండ్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భూగర్భ జలాలు పెంచేందుకు, నీటిని నిలువ చేసేందుకు మండలంలో అన్ని గ్రామాల్లో ఇటువంటి పనులను చేయించాలని ఆదేశించారు. ఫారం పాండ్‌ల వల్ల భూగర్భజలాలు పెరగడమే కాకుండా, చుట్టు పక్కల బోరు బావులు రీచార్జ్ అవుతాయని తెలిపారు. వేతనదారులు సమయపాలన పాటించేలా చూడాలని చెప్పారు. ఆయన వెంట ఉపాధి హామీ పథకం ఏపీడీ ఎస్.శారదాదేవి, డ్వామా టెక్నికల్ పర్సన్ కె.యుగేష్, ఏపీఓ కిరణ్మయి, ఈసీఎం వినోద్ కుమార్, తదితరులు ఉన్నారు.

జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పని

దత్తిరాజేరు: ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నామని ఆ పథకం ఏపీఓ వెంకటఅప్పలనాయుడు తెలిపారు. పెదమానాపురం గ్రామంలోని కర్రివాని చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. 481 మంది వేతనదారులు పనికి హాజరైనట్లు మస్తర్ల ద్వారా గుర్తించారు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ రెండుపూటలా పనులకు హాజరు కావాలని సూచించారు.ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందన్నారు. ఆయన వెంట క్షేత్ర సహాయకుడు ఉన్నారు.

బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరి



గుర్ల: గుర్లలో వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్యశాఖ అధికారులు



కొత్తవలస: తుమ్మికాపల్లిలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

గుర్ల: క్షయ(టీబీ) వ్యాధి బారిన పడకుండా వయోజనులు, దూమపానం చేసే వారు, హైరిస్క్‌గా పరిగణించ బడుతున్న వారు తప్పని సరిగా బీసీజీ (బాసిల్లస్ కాల్మెట్‌గురిన్) వ్యాక్సిన్ వేసుకోవాలని జిల్లా వైద్యశాఖ అధికారులు సూచించారు. గుర్ల పీహెచ్‌సీ పరిధిలోని కోటగండ్రేడు, గుర్ల వెల్‌నెస్ కేంద్రాల్లో గురువారం చేపట్టి న బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వైద్యారోగ్యశాఖ జేడీ డాక్టర్ నర్సింగరావు, జిల్లా డీఐఓ డాక్టర్ అచ్యుతకు మారి, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ రాణి పరిశీలించా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడినవారు, 5 ఏళ్ల నుంచి క్షయ వ్యాధితో బాధపడుతున్న వారు, క్షయ వ్యాధిగ్రస్తుల ఇంట్లోని వ్యక్తులు, సుగర్ ఉన్న వారు, పొగ తాగే అలవాటు ఉన్న వారు, బాగా బరువు తగ్గినవారిని గుర్తించి, వారిని హైరిస్క్ గ్రూపులుగా పరిగణించి వ్యాక్సిన్ వేయాలని సిబ్బందిని ఆదేశాంచారు. ప్రతీ గురువారం గ్రామాల్లోని వెల్‌నెస్ కేంద్రాల వద్ద వైద్యసిబ్బంది బీసీజీ వ్యాక్సిన్ వేస్తారని,ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, వ్యాక్సి న్ వేసుకోవాలని ప్రజలకు సూచించారు.

వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో..

కొత్తవలస: వయోజనులంతా క్షయవ్యాధి నివారణకు బీసీజీ టీకాలు వేసుకోవాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సింహాద్రినాయుడు సూచించారు. వియ్యంపేట పీహెచ్‌సీ పరిధి వియ్యంపేట, ముసిరాం, దేవాడ, రామలింగాపురం, వీరభద్ర పురం, తుమ్మికాపల్లి, నిమ్మలపాలెం, ఉత్తరాపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బం ది బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. డాక్టర్ సింహాద్రినాయుడు మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన వారు సుగర్, బీపీ ఉన్న వారు వ్యాక్సిన్ వేసుకోవా లని, క్షయ రోగుల కుటుంబ సభ్యులు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేసుకోవా లని అన్నారు. గర్భిణిలు, బాలింతలు, హెచ్ఐవీ బాధితు లు, అనారోగ్యంతో మంచం పట్టిన వారు, రక్తమార్పిడి చేసుకున్నవారికి ఈ వ్యాక్సిన్ వెయ్యవద్దని ఆరోగ్య సిబ్బందికి సూచించా రు. ఆరోగ్య సిబ్బంది జగదాంబ, నరసింహారావు, వి.పద్మావతి,ఈశ్వరరావు,సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం సందర్శన



విద్యార్థులు తయారు చేసిన పేపర్ బొమ్మలను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిశాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి గురువా రం సందర్శించారు. పేపర్ క్రాఫ్ట్‌లో భాగంగా విద్యార్థులు రంగుల పేపర్లతో తయారు చేసిన ఫ్లవర్స్, బొమ్మలు ఇతర కళాకృతులను పరిశీలించి అభినందించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో భాగంగా గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన శిబిరాలు విజ్ఞానానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. సెలవులు ముగిసే వరకు శిబిరాలు కొనసాగుతాయని, వివిధ అంశాలపై శిక్షణ, అవగాహన కల్పిస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై పోటీలు నిర్వహించి విజేతలకు శిబిరం ముగింపు రోజున బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని నాగళ్లవలస సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ పి.హరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జమ్ము, జమ్ముపేట గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, అలాగే నాగళ్లవలస, కెల్ల గ్రామాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో కొత్త విద్యుత్ లైన్లు వేయనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గొట్లాం ఫీడర్ పరిధిలో..

బొండపల్లి: మండలంలోని గొట్లాం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ శంకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో గొట్లాం, రోళ్లవాక, అయ్యన్నఅగ్రహారం, రెడ్డిపేట, జియ్యమ్మవలస, డోలపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి గురుకులంలో ప్రవేశాలు

లక్కవరపుకోట: జమ్మాదేవిపేటలోని మహాత్మా జ్యోతిబా బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి అడ్మిషన్లు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థినుల తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌లకు ఇప్పటికే సమాచారం అందించామని పేర్కొన్నారు. మెరిట్ జాబితా పాఠశాల ప్రధాన గేటు వద్ద అతికించామని తెలిపారు. అడ్మిషన్‌లకు వచ్చే విద్యార్థినులు తమ ర్యాంక్ కార్డు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెలుపు రేషన్ కార్డు జెరాక్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో శనివారం ఉదయం 10 గంటలకు పాఠశాలలో హాజరు కావాలని సూచించారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



ఎల్.కోట మోడల్ స్కూల్‌లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు చేసిన ఏర్పాట్లు

కొత్తవలస /లక్కవరపుకోట: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కొత్తవలస మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 172 మంది విద్యార్థులు, ఎల్.కోటలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 290 మంది పరీక్షలు రాయనున్నట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు శివశంకర్, అప్పారావు గురువారం తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి, మధ్యాహ్నం12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు.ఈ నెల 31వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పరీక్షా కేంద్రాల సమీపాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

లక్కవరపుకోట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల కేంద్రంగా 10వ తరగతి సప్లిమెంటరీ పరిక్షలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కె.శారదాదేవి గురువారంఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో ఎస్.కోట,వేపాడ,ఎల్.కోట,జామి,కొత్తవలస మండలాలకు చెందిన 256 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఉంటాయని స్పష్టం చేశారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



కర్మాగారం గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

కొత్తవలస: అప్పన్నపాలెం గ్రామం సమీపంలోని జిందాల్ స్టెయిన్ లెస్ స్టీల్ కర్మాగార కార్మికుల ఆందోళన ఏడో రోజు గురువారం కొనసాగింది. ముడి సరుకు కొరత కారణంగా ఈనెల 17వ తేదీన కర్మాగార యాజ మాన్యం లేఆఫ్‌ను ప్రకటించింది. నాటి నుంచి కర్మాగారంలో పనిచేస్తున్న 280 మంది కార్మికులు ఆందోళన బాటపట్టారు. కర్మాగారం గేటు వద్ద వంటావార్పు చేస్తూ తమ నిరసన తెలుపుతున్నారు. కార్మిక సంఘా ల జేఏసీ, కర్మాగార యాజమాన్యానికి మధ్య ఇటీవల విజయనగరం జిల్లా లేబర్ కమిషనర్ కార్యాలయం లో జరిగిన చర్చలు కొలిక్కి రాలేదు. ఈనెల 29 న మరోమారు చర్చలు జరిపేందుకు వాయిదా వేశారు. ఆందోళన చేస్తున్న కార్మికులకు గురువారం భోజన సదుపా యం కొత్తవలస మేజర్ పంచాయితీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్యరామస్వామి కల్పించారు. కర్మాగార కార్మికుల జేఏసీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన



బోజంకివానిపాలెంలో రైతులకు నవధాన్యాల కిట్లు అంద చేస్తున్న అధికారులు



బోజంకివానిపాలెంలో రైతులు పంటకు వేస్తున్న సేంద్రియ ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

వేపాడ: ప్రకృతి వ్యవసాయంతో పాటు సీడ్ బాల్ విత్తనాలు విత్తుకోవడంపై రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరింత అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ రీజినల్ అధికారులు ఆర్టీఎల్ ప్రకాష్, ఆర్టీఓ హేమసుందర్ సూచించారు. బోజంకివాని పాలెంలో రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటలను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ కాలంలో వరి విత్తనాలను సీడ్ బాల్స్‌గా చేసి వాటిని పొలంలో జల్లితే వర్షాలు కురిచేటప్పుడు సీడ్ బాల్‌లోని విత్తనాలు మొలకెత్తుతాయని వరించారు. ఈ పద్ధతిపై క్షేత్రస్థాయిలో సిబ్బంది రైతులకు ప్రయోగ పూర్వ కంగా వివరించాలని సూచించారు. అనంతరం రైతులకు నవధాన్యాల విత్తన ప్యాకెట్లు అందజేశారు. నువ్వుల పంటలో నవధాన్యాల సాగును అధికారులు పరిశీలించి, పలు సూచనలు సలహాలు అందించారు. నువ్వుల పంట చేనులో తెల్లజొన్న, బెండ, గోంగూర, చిక్కుడు, బొబ్బర తదితర అంతర పంటలు వేయడం వల్ల జీవ వైవిధ్యం జరిగి నేలకు పోషకాలు అందుతాయని చెప్పారు. రైతులంతా నవధాన్యాల సాగు చేసేలా చైతన్యవంతం చేయాలని ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందికి సూచించారు. ఎన్ఎఫ్ఏ వరప్రసాద్, ఎంటీఏ వసంత, ఎంటీ సన్యాసమ్మ, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్‌లు, ఈఆర్‌పీలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



శృంగవరపుకోట: సీతారాంపురం పూజలందు కుంటున్న మరిడిమాంబ అమ్మవారు



శృంగవరపుకోట: సీతారాంపురంలో మరిడిమాంబను దర్శించుకుంటున్న భక్తులు



జామి: కుమరాంలో ఐశ్వర్యలక్ష్మీనరసింహస్వామికి నైవేద్యంగా సమర్పించేందుకు పండ్లు, స్వీట్లు తీసుకుని వస్తున్న మహిళలు



జామి: కుమరాంలోని ఐశ్వర్యలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలందుకుంటున్న స్వామివారు



శృంగవరపుకోట: సీతంపేటల ధారగంగమ్మ జంగిడిని తీసుకువస్తున్న అమ్మవారి సేవకులను స్వాగతిస్తున్న గ్రామస్తులు

శృంగవరపుకోట: మండలంలోని సీతారాంపురం గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహిం చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు.

ముగిసిన వేడుకలు

జామి: కుమరాం గ్రామంలోని కల్యాణ్‌నగర్‌లో మూడురోజులుగా నిర్వహిస్తున్న ఐశ్వర్యలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆలయ వార్షికోత్సవం గురువారంతో ముగిసింది. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్వామివారికి అష్టోత్తర శత నామావళి, ఆరాధన,పుష్పయాగం, ఉంజల్‌సేవ, శ్రీహరి సంకీర్త న, పండిత సత్కారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు చేసి, వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూ జలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.



జామి: కుమరాంలో ఐశ్వర్యలక్ష్మీ నరసింహస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

ధారగంగమ్మ పండగ

శృంగవరపుకోట: ఎస్.కోటలో గ్రామదేవత ధారగంగమ్మ పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయాలను అనుసరించి, పండగ చేస్తున్నారు. సీతంపేట గ్రామంలో గురువారం అమ్మవారి జంగిడిని ఊరేగించారు. అమ్మవారి సేవకులు వచ్చే రోడ్డులో గ్రామస్తులు నీళ్ల పోసి, వారి కాళ్లు కడిగి ఆహ్వానించారు.

అన్నమాచార్యునికి స్వర నీరాజనం



అన్నమయ్యకు స్వరనీరాజనం పలుకుతున్న గాయనీ,గాయకులు

విజయనగరం టౌన్: శ్రీవారి స్వచ్ఛంద సేవాసంస్థ, ఘంటసాల స్మారక కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి వేడుకలను గురువారం సాయంత్రం స్థానిక గురజాడ కళాభారతి వేదికపై ఘనంగా నిర్వహించారు. యనమండ్ర వేణుగోపాలశాస్త్రి ఆశీస్సులతో కార్యక్రమాన్ని కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌సీఎస్ గ్రూప్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస్ హాజరయ్యారు. కళావేదికపై ఏర్పాటు చేసిన వేంకటేశ్వరస్వామి 12 అడుగుల విగ్రహం, సెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం భీష్మారావు సారథ్యంలో అన్నమయ్య సంకీర్తనలను గాయనీ, గాయకులు హృద్యంగా ఆలపించారు. భగవతీ నృత్యకళామందిర్ రమణకుమారి బృందం నిర్వహించిన అన్నమయ్య జననం నృత్యరూపకాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గ్రంధి విష్ణుమూర్తి, గౌరవాధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, కోశాధికారి వైవీవీ సత్యనారాయణ (అబ్బులు), సహాయ కార్యదర్శి బి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.ఉమాశంకర్, అక్షయ కన్‌స్ట్రక్షన్ అధినేత ఏగిరెడ్డి తిరుపతినాయుడు, డాక్టర్ జి.సన్యాసమ్మ, ఈఆర్.సోమయాజులు, కాపుగంటి ప్రకాష్ , అధిక సంఖ్యలో సంగీతాభిమానులు పాల్గొన్నారు.